వైద్యులందరికీ ప్రత్యేక ఐడీలు

- ఎన్ఎంఆర్ పోర్టల్‌లో రిజిస్ట్రేషన్ తప్పనిసరి
- ఎన్ఎంసీ వెల్లడి

న్యూఢిల్లీ: నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసీ) ఇటీవల ప్రారంభించిన పోర్టల్‌లో వైద్యుల నమోదు ప్రక్రియను ప్రారంభించింది. దేశంలో ప్రాక్టీస్ చేయడానికి అర్హులైన ఎంబీబీఎస్ వైద్యులందరూ ఇందులో తప్పనిసరిగా నమోదు చేసుకోవాల్సి ఉంటుంది. అలా నమోదు చేసుకున్న వారికి విశిష్ట గుర్తింపు ఐడీని కేటాయిస్తారు. నేషనల్ మెడికల్ రిజిస్టర్(ఎన్ఎంఆర్) అనేది ఒక డైనమిక్ డాటాబేస్. ఇందులో వైద్యుల ప్రామాణికతను ఆధార్ ద్వారా ధ్రువీకరిస్తారు. రిజిస్ట్రేషన్‌కు ఎన్ఎంఆర్ సిద్ధంగా ఉన్నదని, రిజిస్టర్డ్ మెడికల్ ప్రాక్టీషనర్లు (ఆర్ఎంపీలు) అందరూ తక్షణమే ఇందులో నమోదు చేసుకోవాలని ఎన్ఎంసీ కార్యదర్శి డాక్టర్ బి శ్రీనివాస్ తెలిపారు. ఇండియన్ మెడికల్ రిజిస్టర్ (ఐఎంఆర్) వద్ద నమోదుచేసుకున్న ఎంబీబీఎస్ వైద్యులు కూడా ఎన్ఎంఆర్‌లో మరోమారు రిజిస్టర్ చేసుకోవాలని నోటీస్ జారీ అయ్యింది. దీని ప్రకారం, పోర్టల్‌లో వైద్యులకు సంబంధించిన సమాచారం కొంత ప్రజలకు కూడా అందుబాటులో ఉంటుంది. 'హెల్త్ కేర్ ప్రొవైడర్ రిజిస్ట్రీ' లోనూ వైద్యులు చేరేందుకు ఆప్షన్‌ను తీసుకొచ్చారు. 'దేశంలో ఇప్పటివరకు ఎంతమంది అర్హులైన వైద్యులున్నారు? విదేశాలకు వెళ్లినవారెంత మంది? డాక్టర్‌గా లైసెన్స్ కోల్పోయిన వాళ్లెంత మంది? సమగ్రమైన డాటా అందుబాటులో లేదు. ఈ నేపథ్యంలో ఎన్ఎంఆర్ పోర్టల్‌ను తీసుకొచ్చారు. దాదాపు 13 లక్షల మంది వైద్యుల డాటా పోర్టల్‌లో అందుబాటులో ఉంటుంది' అని ఎన్ఎంసీ అధికారి ఒకరు చెప్పారు.

వెరిఫికేషన్ అయ్యాకే ఐడీ జారీ

ఆధార్ ఐడీ, ఎంబీబీఎస్ డిగ్రీ సర్టిఫికెట్ డిజిటల్ కాపీ, ఎంసీఐ లేదా రాష్ట్ర స్థాయి స్టేట్ మెడికల్ కౌన్సిల్ జారీచేసిన సర్టిఫికెట్‌లను రిజిస్ట్రేషన్ సమయంలో వైద్యులు సమర్పించాల్సి ఉంటుంది. వైద్యుడు సమర్పించిన పత్రాలను సంబంధిత స్టేట్ మెడికల్ కౌన్సిల్‌కు పంపి ధృవీకరిస్తారు. దరఖాస్తులోని వివరాలు సరైనవా?కావా? అన్నది సంబంధిత వైద్య కాలేజీకి పంపి నిర్ధారిస్తారు. వివరాలన్నీ సరైనవేనని తేలాక.. దరఖాస్తు తిరిగి ఎన్ఎంసీకి చేరుతుంది. అటు తర్వాత ఎన్ఎంసీ నుంచి సదరు వైద్యుడికి విశిష్ట గుర్తింపు 'ఎన్ఎంఆర్ ఐడీ' జారీ అవుతుంది.

సీఎం పదవి నాకే ఇవ్వాలి

- హర్యానా బీజేపీ సీనియర్ నేత అనిల్ విజ్
- ఎన్నికలకు ముందే కమలం పార్టీలో పోటీ
- సైనీకే మద్దతు ప్రకటించిన పార్టీ అధిష్ఠానం

అంబాల: వచ్చే నెల 5న హర్యానాకు అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ అధికార బీజేపీకి ఆ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి అనిల్ విజ్ షాకిచ్చారు. రాష్ట్రంలో బీజేపీ కనుక తిరిగి అధికారంలోకి వస్తే, సీఎం పదవి తనకే ఇవ్వాలన్నారు. అయితే హర్యానాలో గెలిస్తే నాయబ్ సింగ్ సైనీయే తిరిగి సీఎం అవుతారని ఇప్పటికే బీజేపీ అధిష్ఠానం ప్రకటించింది. ఈ క్రమంలో అనిల్ విజ్ ఆదివారం మాట్లాడుతూ 'ఇప్పటివరకు నేను అధిష్ఠానాన్ని ఏమీ అడగ లేదు. అంబాల, రాష్ట్ర ప్రజలు నా దగ్గరకొచ్చి ఇంత సీనియర్ అయి ఉండి మీరెందుకు సీఎం కాలేదని అడుగుతున్నారు. ప్రజల డిమాండ్, నా సీనియారిటీ ఆధారంగా ఈసారి నేనే సీఎంని అవుతా' అని అన్నారు. తనను సీఎంగా చేయడం పార్టీ ఇష్టమని.. ఒక వేళ సీఎంను చేస్తే హర్యానా తలరాత, ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేస్తానని అన్నారు.

నాయబ్ సింగే సీఎం అభ్యర్థి

హర్యానాలో బీజేపీ విజయం సాధిస్తే ప్రస్తుత సీఎం నాయబ్ సింగ్ సైనీయే మరోసారి ముఖ్యమంత్రి అవుతారని హర్యానా పార్టీ ఇన్‌చార్జి ధర్మేంద్ర ప్రధాన్ స్పష్టం చేశారు. అనిల్ విజ్ ప్రకటనను ఉద్దేశించి మాట్లాడుతూ ఒక పార్టీ నేతగా ఆయన అలా మాట్లాడి ఉండవచ్చన్నారు.

కేజ్రీ 'ముందస్తు' వ్యూహం!

- రెండ్రోజుల్లో రాజీనామా చేయనున్నట్టు ఢిల్లీ ముఖ్యమంత్రి సంచలన ప్రకటన
- మహారాష్ట్రతో పాటే ఢిల్లీ శాసనసభకూ ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్
- రెండు, మూడు రోజుల్లో పార్టీ సమావేశం
- కొత్త ముఖ్యమంత్రి ఎంపికపై నిర్ణయం
- భార్యను సీఎం చేసేందుకు డ్రామా: బీజేపీ

ఆప్ కార్యకర్తల సమావేశంలో మంత్రులతో కలిసి పాల్గొన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ సంచలన నిర్ణయం తీసుకున్నారు. రెండు రోజుల్లో తన పదవికి రాజీనామా చేస్తానని ప్రకటించారు. వచ్చే ఫిబ్రవరిలో ఢిల్లీ ఎన్నికలు జరగాల్సి ఉన్నదని, కానీ.. నవంబర్‌లో మహారాష్ట్రతో పాటే నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముందస్తు ఎన్నికల వ్యూహంలో భాగంగానే ఆయన రాజీనామా ప్రకటన చేసినట్టు విశ్లేషకులు చెబుతున్నారు. ఆదివారం ఢిల్లీలోని ఆప్ కార్యాలయంలో పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి కేజ్రీవాల్ మాట్లాడారు. 'నిర్దోషులుగా నిరూపించుకొనేవరకు నేను సీఎంగా, మనీశ్ సిసోడియా డిప్యూటీ సీఎం పదవి చేపట్టబోం. కొత్త సీఎం ఎంపికపై రెండు, మూడు రోజుల్లో పార్టీ సమావేశం ఏర్పాటు చేస్తాం. ఆప్‌లో చీలికలు తెచ్చి ఢిల్లీలో అధికారం చేపట్టేందుకు బీజేపీ కుట్రలు చేసింది. పార్టీని ముక్కలు చేసేందుకు నన్ను జైలుకు కూడా పంపారు. కానీ, ఎన్ని ఎత్తులు వేసినా పార్టీని విచ్ఛిన్నం చేయలేకపోయింది. ఎన్ని ఇబ్బందులకు గురిచేసినా రాజ్యాంగాన్ని కాపాడేందుకు నేను ఇన్ని రోజులు రాజీనామా చేయలేదు. జైలు నుంచి ప్రభుత్వాన్ని ఎందుకు నడిపించకూడదు అని సుప్రీంకోర్టు కూడా ప్రశ్నించింది. నాకు బీజేపీ ముఖ్యం కాదు. ప్రజలే ముఖ్యం' అని వెల్లడించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓట్లు అడుగుతానని, తాను నిర్దోషిని అని నమ్మితే ప్రజలు ఓట్లు వేసి ఆప్‌ను గెలిపించాలని కోరారు. ప్రజలే అంతిమ న్యాయ నిర్ణేతలు అని స్పష్టంచేశారు.

బీజేపీయేతర సీఎంలకు నా విజ్ఞప్తి

'ఆప్ కష్టాల్లో ఉన్నప్పుడు సాక్షాత్తు భగవంతుడే మాతో ఉండి ముందుకు నడిపించాడు. దేవుడిచ్చిన ధైర్యంతో ప్రత్యర్థులతో పోరాడాం. మన నాయకులు సత్యేంద్ర జైన్, అమానతుల్లా ఖాన్ ఇప్పటికీ జైల్లోనే ఉన్నారు. వారు కూడా త్వరలోనే బయటకు వస్తారని ఆశిస్తున్నా' అని కేజ్రీవాల్ తెలిపారు. 'బీజేపీయేతర సీఎంను గద్దె దించేందుకు వాళ్లు కొత్త ఆటలు ఆడుతున్నారు. తప్పుడు కేసులు బనాయిస్తున్నారు. సీఎంలందరికీ నేను ఒకటే విజ్ఞప్తి చేస్తున్నా. మీపై కేసులు నమోదు చేసినా రాజీనామా చేయొద్దు' అని విన్నవించారు.

ముందస్తు ఎన్నికలకు వెళ్లేందుకేనా?

ఆప్ నేతలపై అక్రమ కేసులు బనాయించి, కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం వేధింపులకు గురిచేస్తున్నదనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఆప్ భావిస్తున్నది. తద్వారా ప్రజల సానుభూతి పొందాలని యోచిస్తున్నది. ఫిబ్రవరిలో ఎన్నికలకు వెళితే ఆప్ నేతల అరెస్టు ప్రభావం పెద్దగా కనిపించదని భావించే.. ముందస్తు ఎన్నికలకు వెళ్లాలని కేజ్రీవాల్ యోచిస్తున్నట్టు విశ్లేషకులు చెబుతున్నారు.

కేజ్రీవాల్‌వి పీఆర్ స్టంట్లు: బీజేపీ

కేజ్రీవాల్ తన భార్య సునీతను సీఎం చేసేందుకు ఈ ప్లాన్ వేస్తున్నారని బీజేపీ ఆరోపించింది. ఆ పార్టీ జాతీయ అధికార ప్రతినిధి షెహజాద్ పునావాలా మాట్లాడుతూ.. కేజ్రీవాల్‌వి పీఆర్ స్టంట్లు అని, ఎమోషనల్ కార్డును వాడుతున్నారని విమర్శించారు. 'సీఎం హోదాలో ఎలాంటి అధికారిక ఫైళ్లపై సంతకాలు చేయకూడదని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. కాబట్టే ఆయన రాజీనామా కార్డును వాడుతున్నారు. ఢిల్లీ ప్రజలకు ఆప్ అవినీతి అర్థమైంది. కేజ్రీవాల్ సోనియాను ఫాలో అవుతున్నారు. అప్పట్లో మన్మోహన్‌సింగ్‌ను ముందుంచి.. తెరవెనుక సోనియా నడిపించారు. అదేవిధంగా, తనకు ఓటు వేయరని తెలిసి కేజ్రీవాల్ రాజీనామా నాటకం ఆడుతున్నారు' అని బీజేపీ నేత ప్రదీప్ భండారీ ఆరోపించారు.

ఢిల్లీ తదుపరి సీఎం ఎవరు?

పరిశీలనలో పలువురు మంత్రుల పేర్లు!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: మరో రెండు రోజుల్లో ఢిల్లీ సీఎం పదవికి అరవింద్ కేజ్రీవాల్ రాజీనామా చేయబోతున్నారు. ఈ నేపథ్యంలో ఢిల్లీ సీఎంగా కేజ్రీవాల్ స్థానంలో పార్టీ ఎవర్ని నియమిస్తుందన్న అంశం ఆసక్తికరంగా మారింది. ఢిల్లీ మంత్రులు అతిశీ, సౌరభ్ భరద్వాజ్, కైలాశ్ గెహ్లోట్, గోపాల్ రాయ్ పేర్లను ఆప్ పరిశీలిస్తున్నట్టు మీడియాలో వార్తా కథనాలు వెలువడ్డాయి. కేజ్రీవాల్ సతీమణి సునీతా కేజ్రీవాల్ పేరు కూడా తెరపైకి వచ్చింది. .

సునీత కేజ్రీవాల్ : కేజ్రీవాల్ అరెస్టుతో ఆప్ నుంచి కీలక నేతగా తెరపైకి వచ్చారు. ఇండియా కూటమి సమావేశాల్లో వివిధ పార్టీల నాయకుల్లో ఒకరిగా నిలబడ్డారు. లోక్‌సభ ఎన్నికల్లో పార్టీ తరపున చురుకుగా ప్రచారం పాల్గొన్నారు.

అతిశీ: ఆక్స్‌ఫర్డ్‌లో మాస్టర్స్ చేశారు. ఆర్థికం, ప్రజా పనులు, విద్యా మంత్రిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఢిల్లీలో ప్రాథమిక విద్యను మెరుగు పర్చటంలో కీలక పాత్ర పోషించారు.

సౌరభ్ భరద్వాజ్: ఆరోగ్య మంత్రిగా ఉన్నారు. సీఎం పదవికి బలమైన పోటీదారుగా ఆయన పేరు వినిపిస్తున్నది. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా కెరీర్ మొదలుపెట్టి రాజకీయాల్లోకి వచ్చారు. పార్టీ ఆవిర్భావం నుంచి ఉన్నారు.

గోపాల్ రాయ్: పర్యావరణం, సాధారణ పరిపాలన మంత్రిగా ఉన్నారు. విద్యార్థి సంఘం మాజీ నాయకుడిగా పార్టీ వ్యవహారాల్లో గట్టి పట్టు సాధించారు. పార్టీలో, ప్రభుత్వంలో ప్రభావశీల వ్యక్తిగా కొనసాగుతున్నారు.

కైలాశ్ గెహ్లోట్: న్యాయశాఖ, ఐటీ, రెవెన్యూ, ప్లానింగ్ తదితర శాఖల మంత్రిగా ఉన్నారు. సీఎం కేజ్రీవాల్‌కు విశ్వసనీయ వ్యక్తిగా మంత్రి కైలాశ్ గెహ్లోట్‌కు పేరుంది.

ఇనాక్టివ్ జీమెయిల్ ఖాతాల తొలగింపు

- వ్యక్తిగత అకౌంట్లు మాత్రమే
- 20 నుంచి ప్రారంభం

న్యూఢిల్లీ: రెండేండ్ల నుంచి ఇనాక్టివ్‌గా ఉన్న వ్యక్తిగత జీమెయిల్ ఖాతాలను సెప్టెంబర్ 20 నుంచి తొలగించాలని గూగుల్ నిర్ణయించింది. సర్వర్ నిర్వహణను ఆప్టిమైజ్ చేయడానికి దీనిని అమలు చేయనుంది. అయితే కేవలం వ్యక్తిగత జీమెయిల్ అకౌంట్లకే దీన్ని వర్తింపజేయనుంది.ఈ-మెయిల్ పంపడం లేదా చదవడం, గూగుల్ ఫొటోస్‌లో ఫొటో అప్‌లోడ్ చేయడం లేదా షేర్ చేయడం, యూట్యూబ్ వీడియో చూడటం, గూగుల్ డ్రైవ్‌ను ఉపయోగించడం లేదా దాని ద్వారా సెర్చ్ చేయడం ద్వారా తొలగింపును తప్పించు కోవచ్చు.

ఇన్సులిన్ నిరోధకతకు హార్మోన్ చికిత్స

మెనోపాజ్ మహిళలకు ఉపశమనం

న్యూయార్క్, సెప్టెంబర్ 15: హార్మోన్ చికిత్సతో ఇన్సులిన్ నిరోధకతను గణనీయంగా తగ్గించవచ్చని తాజా అధ్యయనం వెల్లడించింది. రుతు క్రమం ఆగిన(మెనోపాజ్) మహిళల్లో ఈస్ట్రోజన్ స్థాయిలు తగ్గిపోవడం వల్ల వారు ఇన్సులిన్ నిరోధకత సమస్యను ఎక్కువగా ఎదుర్కొంటారు. అమెరికాలోని డ్రెక్సెల్ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ మెడిసిన్, రీడింగ్ హాస్పిటల్ టవర్ హెల్త్ పరిశోధకుడు డాక్టర్ జియాంగ్ మాట్లాడుతూ కొత్త మెటా పద్ధతిలో చేసిన ఈ అధ్యయనంలో ఆరోగ్యవంతులైన మెనోపాజ్ మహిళల్లో ఇన్సులిన్ నిరోధకత గణనీయంగా తగ్గిందని తెలిపారు.

కేరళలో నిఫా కలకలం

మలప్పురంలో ఒకరి మృతి

మలప్పురం: కేరళలోని మలప్పురంలో ఈ నెల 9న మరణించిన 24 ఏళ్ల యువకునికి నిఫా వైరస్ సోకినట్లు ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. ఈ వ్యక్తి మరణానంతరం ప్రాంతీయ వైద్యాధికారి నిర్వహించిన దర్యాప్తులో నిఫా వైరస్ గురించి అనుమానం వచ్చిందన్నారు. వెంటనే నమూనాలను పరీక్షల కోసం పంపించామని చెప్పారు. కొజికోడ్‌లో నిర్వహించిన పరీక్షల్లో నిఫా వైరస్ పాజిటివ్ అని నిర్ధారణ అయిందని వివరించారు. పుణేలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ వైరాలజీ కూడా ఇది నిఫా వైరస్ ఇన్ఫెక్షన్ అని ఆదివారం ధ్రువీకరించింది. మృతుని స్వస్థలం మలప్పురం. ఆయన స్నేహితులతో కలిసి బెంగళూరులో కొన్ని రోజులు గడిపారు. అక్కడి నుంచి వచ్చిన తర్వాత ప్రాణాలు కోల్పోయారు.

రాహుల్ గాంధీ నం.1 ఉగ్రవాది

కేంద్రమంత్రి బిట్టు

భాగల్పూర్: లోక్‌సభ ప్రతిపక్ష నేత, కాంగ్రెస్ మాజీ అధ్యక్షుడు రాహుల్ గాంధీ నంబర్ వన్ ఉగ్రవాది అని కేంద్ర మంత్రి రవ్‌నీత్ సింగ్ బిట్టు ఆరోపించారు. ఆదివారం మీడియాతో మాట్లాడుతూ, రాహుల్ గాంధీ అమెరికా పర్యటనలో భారత్‌లోని సిక్కుల పరిస్థితులపై చేసిన వ్యాఖ్యలపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేర్పాటువాదుల మద్దతు ఇప్పుడు రాహుల్‌కు లభించిందని, సిక్కులకు వ్యతిరేకంగా ఆయన చేసిన వ్యాఖ్యలను వేర్పాటువాదులు, మోస్ట్ వాంటెడ్ పర్సన్స్ ప్రశంసిస్తున్నారని చెప్పారు. అందువల్ల ఆయన మన దేశానికి నంబర్ వన్ టెర్రరిస్ట్ అని, కాబట్టి ఆయనను పట్టుకున్నవారికి బహుమతి ప్రకటించాలన్నారు. బిట్టు వ్యాఖ్యలను కాంగ్రెస్ తీవ్రంగా ఖండించింది.

భర్త రోజూ స్నానం చేయడం లేదని విడాకులు

ఆగ్రా: యూపీలోని ఆగ్రాకు చెందిన ఓ భార్య తన భర్త రోజూ స్నానం చేయడం లేదని, తనకు విడాకులు ఇప్పించాలని పెండ్లయిన 40 రోజులకే కోర్టుకెక్కింది. తన భర్త ఒంటి నుంచి వచ్చే దుర్వాసనను భరించలేకపోతున్నానని వాపోయింది. దీనిపై భర్త స్పందిస్తూ తాను సాధారణంగా నెలకు ఒకసారో, రెండుసార్లో స్నానం చేస్తానని చెప్పాడు. అధికారుల కౌన్సిలింగ్ ఇవ్వడంతో పరిశుభ్రంగా ఉండటానికి అతడు అంగీకరించాడు. అయినా కలిసి ఉండటానికి అతడి భార్య విముఖత వ్యక్తం చేసింది.

అందుబాటులోకి మరో 6 వందేభారత్ రైళ్లు

రాంచీ: దేశంలో మరో ఆరు వందే భారత్ రైళ్లు అందుబాటులోకి వచ్చాయి. జార్ఖండ్, ఒడిశా, బీహార్, యూపీల నుంచి నడిచే ఈ రైళ్లను ప్రధాని మోదీ ఆదివారం రాంచీ విమానాశ్రయం నుంచి వర్చువల్‌గా జెండా ఊపి ప్రారంభించారు. వాస్తవానికి ఈ రైళ్లను ఆయన టాటానగర్ స్టేషన్ నుంచి ప్రారంభించాల్సి ఉన్నా వాతావరణం అనుకూలించక ఆయన హెలికాప్టర్ బయలుదేరలేదు. ఈ కొత్త వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌లు టాటానగర్-పాట్నా, బ్రహ్మపూర్-టాటానగర్, రూర్కెలా-హౌరా, డియోఘర్-వారణాసి, భాగల్పూర్-హౌరా, గయా-హౌరా రూట్లలో నడుస్తాయి. డియోఘర్, వారణాసి, కాళీఘాట్, బెలూర్ మఠం (కోల్‌కతా) తదితర పుణ్యస్థలాలకు వెళ్లేందుకు ఈ రైళ్లు ఎంతో ఉపయోగపడతాయని రైల్వే శాఖ తెలిపింది.

త్వరలోనే జనగణన

- కులగణనపై ఇంకా నిర్ణయం తీసుకోలేదు
- కేంద్ర వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: నాలుగేండ్ల క్రితం మొదలవ్వాల్సిన దేశ జనాభా లెక్కల ప్రక్రియపై మోదీ సర్కార్ ఎట్టకేలకు కసరత్తు మొదలుపెట్టింది! జనగణన ప్రక్రియ త్వరలో ప్రారంభించేందుకు కేంద్రం సన్నాహాలు చేస్తున్నదని సంబంధిత వర్గాలు ఆదివారం మీడియాకు తెలిపాయి. పౌరుల నుంచి సమాచారాన్ని సేకరించేందుకు 'రిజిస్ట్రార్ జనరల్, సెన్సెస్ కమిషనర్' కార్యాలయం 31 ప్రశ్నలను సిద్ధం చేసింది. అయితే.. దీంట్లో కులం అనే కాలమ్ ఉంటుందా? లేదా? అన్నదానిపై కేంద్రం ఎటూ తేల్చుకోలేకపోతున్నదని సమాచారం! దీనిపై ఇంకా నిర్ణయం తీసుకోలేదని కేంద్ర ప్రభుత్వ వర్గాలు తాజాగా వెల్లడించాయి. మనదేశంలో 1881 నుంచి ప్రతి పదేండ్లకోసారి దేశవ్యాప్తంగా జనాభా లెక్కల్ని సేకరిస్తున్నారు. దీని ప్రకారం జనగణనలో తొలి దశ 2020 ఏప్రిల్ 1న మొదలుకావాలి. కొవిడ్ కారణంగా కేంద్రం పలుమార్లు వాయిదా వేస్తూ వచ్చింది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలు కూడా జనాభా లెక్కలతో ముడిపడి ఉందన్న సంగతి తెలిసిందే. పార్లమెంట్ బిల్లును ఆమోదించిన తర్వాత చేపట్టిన తొలి జనాభా లెక్కల ఆధారంగా డీలిమిటేషన్ కసరత్తును పూర్తిచేయాల్సి ఉంటుంది. అటు తర్వాత చట్టసభల్లో మూడింట ఒకవంతు స్థానాల్ని మహిళలకు రిజర్వ్ చేస్తారు. సబ్సిడీ పథకాల అమలుకు 2011 జనాభా లెక్కలను కాకుండా, తాజా గణాంకాల్ని తీసుకొని పథకాల్ని అమల్లోకి తేవాలని వివిధ రాజకీయ పార్టీలు గట్టిగా కోరుతున్నాయి.

మోదీ 3.0లోనే జమిలి!

కేంద్ర ప్రభుత్వ వర్గాల వెల్లడి

న్యూఢిల్లీ: 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' విధానాన్ని ప్రస్తుత ఎన్డీయే ప్రభుత్వ హయాంలోనే అమలు చేసే అవకాశం ఉన్నది. విశ్వసనీయ వర్గాలు తెలిపిన సమాచారం ప్రకారం, జమిలి ఎన్నికలకు పార్టీలకు అతీతంగా మద్దతు లభిస్తుందని బీజేపీ నేతృత్వంలోని ఎన్డీయే సర్కారు భావిస్తున్నది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలో మూడోసారి ఏర్పాటైన ప్రభుత్వం 100 రోజులు పూర్తి చేసుకుంది. మిగిలిన పదవీ కాలం పూర్తయ్యే వరకు మిత్ర పక్షాల మద్దతు ఇదే విధంగా కొనసాగుతుందని బీజేపీ విశ్వాసంతో ఉన్నది. ఓ మీడియా సంస్థ విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ వెల్లడించిన వివరాల ప్రకారం, ప్రస్తుత ఎన్డీయే పదవీ కాలంలోనే 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలు' సంస్కరణలను అమలు చేయనున్నారు. స్వాతంత్ర్య దినోత్సవ సందర్భంగా మోదీ ప్రసంగంలో కూడా దీనిని ప్రస్తావించారు. పదే పదే ఎన్నికలు జరుగుతుండటం వల్ల దేశ ప్రగతికి ఆటంకాలు ఏర్పడుతున్నాయని చెప్పారు. 'ఒక దేశం-ఒకేసారి ఎన్నికలకు దేశం ముందుకు రావాలన్నారు.

కోవింద్ కమిటీ ఏం చెప్పిందంటే?

మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన ఉన్నత స్థాయి కమిటీ కూడా దేశవ్యాప్తంగా ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని సిఫారసు చేసింది. మొదట లోక్‌సభ, శాసనసభలకు ఒకేసారి ఎన్నికలు నిర్వహించాలని, ఆ తర్వాత స్థానిక సంస్థల ఎన్నికలను 100 రోజుల్లో పూర్తి చేయాలని తెలిపింది. జమిలి ఎన్నికల నిర్వహణ కోసం 18 రాజ్యాంగ సవరణలు అవసరమవుతాయని కోవింద్ కమిటీ చెప్పింది. వీటిలో చాలా సవరణలకు రాష్ట్రాల ఆమోదం అక్కర్లేదు. కేవలం పార్లమెంటు ఆమోదిస్తే సరిపోతుంది. లా కమిషన్ కూడా 2029 నుంచి లోక్‌సభ, శాసనసభలు, పురపాలక సంఘాలు, పంచాయతీలకు ఒకేసారి ఎన్నికలను నిర్వహించాలని సిఫారసు చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. హంగ్ హౌస్ ఏర్పడినపుడు లేదా అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందినపుడు ఐక్యతా ప్రభుత్వాల ఏర్పాటుకు అవకాశం కల్పించాలని చెప్పవచ్చు.

ప్రధాని పదవికి ఆఫర్!

- విపక్ష నేత ఒకరు అడిగితే నేనే తిరస్కరించా
- కేంద్ర మంత్రి గడ్కరీ
- మోదీజీకి సందేశం పంపేందుకే ఈ వ్యాఖ్యలు
- శివసేన యూబీటీ నేత ప్రియాంక చతుర్వేది

నాగ్‌పూర్/న్యూఢిల్లీ, సెప్టెంబర్ 15: ప్రధాన మంత్రి పదవిపై కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ సంచలన వ్యాఖ్యలు చేశారు. తాను ఆ పదవికి పోటీపడితే మద్దతిస్తామంటూ గతంలో ఓ ప్రతిపక్ష నేత నుంచి ఆఫర్ వచ్చిందని, కానీ ప్రధాని పదవిని చేపట్టడం తన ఆశయం కానందున ఆ ఆఫర్‌ను తిరస్కరించానని తెలిపారు. నాగ్‌పూర్‌లో శనివారం జర్నలిజం అవార్డుల కార్యక్రమంలో ప్రసంగిస్తూ గడ్కరీ ఈ వ్యాఖ్యలు చేశారు. 'నాకు ఓ సంఘటన గుర్తున్నది. నేను ఎవరి పేరునూ చెప్పను. మీరు ప్రధానమంత్రి కావాలనుకుంటే మద్దతిస్తాం అని ఆ వ్యక్తి చెప్పారు. దీంతో మీరు నాకు ఎందుకు మద్దతివ్వాలి? మీ మద్దతును నేను ఎందుకు స్వీకరించాలి? అని నేను ప్రశ్నించా. ప్రధానమంత్రి కావడమే నా జీవితాశయం కాదు. నేను నా విశ్వాసానికి, నా సంస్థకు విధేయుడిని. ఆ విషయంలో నేను రాజీపడను. ఏదైనా పదవి కంటే నా విశ్వాసమే నాకు ముఖ్యమైనది' అని చెప్పారు. అయితే ఆ సంభాషణ ఎప్పుడు, ఎక్కడ, ఎవరితో జరిగిందో గడ్కరీ చెప్పలేదు.

గడ్కరీ నాటకం అద్భుతం : ప్రియాంక చతుర్వేది

ప్రధాని పదవికి పోటీపడితే మద్దతిస్తామంటూ గతంలో ఓ ప్రతిపక్ష నేత నుంచి ఆఫర్ వచ్చిందని గడ్కరీ ప్రకటించడంపై శివసేన (యూబీటీ) నేత ప్రియాంక చతుర్వేది ఘాటుగా స్పందించారు. దేశ ప్రధాని కావాలన్న సొంత కోర్కెను వ్యక్తం చేసేందుకే గడ్కరీ ఈ ప్రకటన చేశారని, తద్వారా తన కోర్కెను తెలియజేస్తూ ప్రధానమంత్రి నరేంద్రమోదీకి సందేశాన్ని పంపారని మా పేర్కొన్నారు. 'నితిన్ జీ.. ప్రతిపక్షాలను అడ్డం పెట్టుకుని మీరు ఆడిన నాటకం అద్భుతంగా ఉన్నది. దేశాన్ని నడిపించగలిగే సమర్థ నాయకులు ఇండియా కూటమిలో ఎంతో మంది ఉన్నారు. బీజేపీ నుంచి నాయకులను అరువు తెచ్చుకోవాల్సిన అగత్యం మాకు పట్టలేదు' అని ప్రియాంక చతుర్వేది 'ఎక్స్'లో పోస్టు చేశారు.

ఐదేండ్లలో 5 వేల నకిలీ వీసాలు

- రూ.300 కోట్ల అక్రమార్జన
- ఢిల్లీలో ముఠా గుట్టు రట్టు

న్యూఢిల్లీ: నకిలీ వీసాలు తయారు చేస్తున్న ఒక ముఠా గుట్టును ఢిల్లీ పోలీసులు రట్టుచేశారు. ఐదుగురు సభ్యుల ఈ ముఠా గత ఐదేండ్లుగా 5 వేల నకిలీ వీసాలు తయారు చేసి 300 కోట్లు ఆర్జించిందన్న విషయం తెలిసి పోలీసులు విస్తుపోయారు. ఈ నెల 2న ఢిల్లీ ఎయిర్‌పోర్టులో నకిలీ వీసాతో స్వీడన్ వెళ్తున్న ఒక వ్యక్తిని అరెస్ట్ చేయగా, ఈ నకిలీ వీసా తయారీ ముఠా గుట్టు రట్టయ్యింది. తొలుత బల్బీర్ సింగ్, జస్వీందర్ సింగ్ అనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేశారు. ఢిల్లీలోని తిలక్‌నగర్‌లోని ఒక ఫ్యాక్టరీలో మనోజ్ మోంగా అనే వ్యక్తి వీటిని తయారు చేస్తున్నట్టు వారు తెలిపారు. పోలీసులు ఫ్యాక్టరీపై దాడి చేసి మనోజ్ మోంగాను అరెస్టు చేశారు. ముఠా సభ్యులు ప్రతినెలా 30 నుంచి 60 నకిలీ వీసాలు తయారు చేస్తారు. వీసాల స్టిక్కర్‌ను 20 నిమిషాల్లో తయారు చేయడం విశేషం. ప్రతి నకిలీ వీసాను రూ.8-10 లక్షలకు అమ్మేవారు. ఇలా గత ఐదేండ్లలో ఐదు వేల మందిని ఈ నకిలీ వీసాల ద్వారా విదేశాలకు పంపినట్టు వారు చెప్పారు.

రామజన్మభూమి పారిశుధ్య మహిళపై

గ్యాంగ్‌రేప్

- సామూహిక లైంగికదాడికి పాల్పడిన ఐదుగురు
- తొలుత కేసు నమోదు చేయని పోలీసులు
- వారం తర్వాత నమోదు.. ఐదుగురి అరెస్ట్
- నిందితులను కఠినంగా శిక్షించాలన్న అఖిలేశ్
- స్పందించని పోలీసులపై చర్యలకు డిమాండ్

అయోధ్య, సెప్టెంబర్ 15: ఉత్తరప్రదేశ్‌లోని అయోధ్య జిల్లాలో దారుణం చోటు చేసుకున్నది. రామాలయంలో పారిశుధ్య సిబ్బందిగా పనిస్తున్న మహిళపై ఐదుగురు సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. బీఏ చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థిని అయిన బాధితురాలి కథనం ప్రకారం.. అయోధ్య జిల్లా సహదత్‌గంజ్‌కు చెందిన వాన్స్ చౌదరి ఆమెకు గత నాలుగేండ్లుగా స్నేహితుడు.